


## హేమ ఫ్యాషన్స్..

ప్రసిద్ధ నటి హేమమాలిని సంపాదకత్వంలో వెలువడుతున్న 'మేరీ సహేలీ' పత్రిక ఆధ్వర్యాన స్త్రీల ఫేషన్లపై ఒక ప్రత్యేక పుస్తకం వెలువడింది. దీని పేరు 'విమెన్స్ హై ఫ్యాషన్'. సల్వార్ కమీజ్‌ల గురించి దీనిలో ప్రత్యేక విశేషాలున్నాయి. సల్వార్-కమీజ్‌ల్ని రకరకాల ఫ్యాషన్లలో తయారు చేయడం గురించి, వాటిలో సంప్రదాయ వైవిధ్యాన్ని జోడించడం గురించి అందంగా, ఆకర్షణీయంగా వీటిని తయారు చేయడం గురించిన సచిత్ర వివరణలు ఈ పుస్తకం ప్రత్యేకతలు.

దీని ఖరీదు 60 రూపాయిలు. రంగు రంగుల ఫోటోలు, కటింగ్ నమూనాలు దీనిలో వున్నాయి. ఇంకా ఈ పత్రికని వెలువరిస్తున్న సంస్థ అయిన పయోనీర్ బుక్ అండ్ కో‌తో ఈ దుస్తుల ఫ్యాషన్లు గురించి పుస్తకాలు తయారు చేస్తు న్నారు. త్వరలో అవి విడుదలవుతాయి.

షాపులలో ఈ పుస్తకం కోసం అడగండి. లేకుంటే పయోనీర్ బుక్ అండ్ కో, డాక్టర్ డి.ఎన్. రోడ్, ఫోర్ట్, బొంబాయి - 400 001కి వ్రాయండి.

## డూప్

"సుధా! నేను నిన్ను మనసారా ప్రేమిస్తున్నాను!"

"నేను కూడా అలాగే ప్రేమిస్తున్నాను."

"మరి ఇంకేం నన్ను పెళ్ళి చేసుకో!"

"నిజమైన ప్రేమకు కట్నాలూ కానుకలూ అడ్డురావు. పెద్దలు కూడా అడ్డురారు. డియర్! నీకో విషయం చెప్పనా."

"ఏమిటది?"

"మా అమ్మా నాన్న చిన్నప్పుడేపోయారు."

"నేనో అనాథ అమ్మాయిని!"

"అందుకే కదా నిన్ను మనసారా..."

"అదే నన్ను... పెళ్ళి చేసుకుని ఆదుకో డియర్" అందామె.

అంతే! తెలుగు సినిమాలో అప్సరల వాడెదురైతే మాయమైపోయినట్లు మన డూప్ హీరో మాయం. ఇది కలా నిజమా అని చూస్తూ నిల్చుండి పోయింది సుధ ఆశ్చర్యంతో...

—లక్కరాజు ప్రఫుల్లచంద్ర

## నిరీక్షణ

—నజీర్ షేక్

అప్పటి దాకా
అనుకోని సంఘటన ఏదీ జరుగలేదు
రోజూ లాగానే
ఆకాశం నీలం పరికిణీ వేసుకుని
సూర్యుణ్ణి తిలకంగా అద్దుకుంది
జీవన మడి గుండం నుంచి జనం గండి దాటుతున్నారు
అప్పుడు—
బస్‌స్టాప్ దగ్గర ఆమె నన్ను చూసి నవ్వింది
మనసు మూగపోయింది,
అయినా అనుమానం నన్నేనా (?)
నాకే ఆ...నవ్వే తెలియని ఆనందం
మాటలు రాని పక్షి పాటలు పాడుతున్నట్లుంది
గాలి నాకు చేరువై నిశ్శబ్ద సంగీతం వినిపిస్తోంది
హృదయం అరల మరలు విప్పుకుంటూ
మంచుతెరల్లా, నిదుర లేచిన కలువ కనుల్లా
అంతలో రానేవచ్చింది హారను కొడుతూ బస్సు
చెయ్యి వూపి ఆమె వెళ్ళి పోయింది.
మరలా తెలవారే దాకా నిరీక్షణ.
రోడ్డు మీద జనం
తలపై సూర్యుని ప్రభంజనం
వెళుతున్నాము మరలా రేపు కోసం వస్తాము.
దిగంతాల కొసల నుంచి, దశదిశల వెలుగు నుంచి
నా స్వప్నాన్ని కలుస్తాను
కళ్ళలో వెలుగై నిలుస్తాను.



## బర్త్‌డే

మాకు కొత్తగా వచ్చిన బ్రాంచి మేనేజరుగారు ఆరోజు పుట్టిన రోజు జరుపుకుంటున్నారు. మేమందరం ఆయన హోదాకు తగ్గట్టుగా కానుకలు వగైరా తీసుకువెళ్లాం.

ఏభై సంవత్సరాలకు గుర్తుగా ఏభై చిన్న కొవ్వొత్తులతో పెద్ద కేకు పెట్టారు బల్లమీద.

ఆయన విమల్ సూటింగ్‌లో ఏభై సంవత్సరాలు వుండవనిపించేట్లుగా వున్నారు. చకచకా నడుచుకుంటూ అందర్నీ విష్ చేస్తూ కేక్ వున్న టేబుల్ దగ్గరకు చేరారు. ఆయన కేక్ కట్ చేసి మొదటి పీస్ ఆయన భార్యామణికి ముద్దుగా, ఆమెతో పాటుగా ఆయన కూడా నోరు తెరిచినంత పని చేసి ఆమె నోట్లో పెట్టారు. మిగతా ముక్కలు కొందరి ముఖ్యులకు పెట్టారు.

"ఛీర్స్"

"హేపీ బర్త్‌డే టూ యూ", "మెనీ హేపీ రిటర్న్స్" అంటూ అరుపులు, కేకలు, పాటలు వినిపించాయి.

నేను ఆఫీసులో కీలకమైన పోస్టులో వుండడం చేత అందరికీ అన్నీ అందాయో, లేదో చూసే బాధ్యత తీసుకోవాల్సి వచ్చింది.. అలా రౌండ్స్ తిరుగుతున్నాను.

మా బ్రాంచి మేనేజర్‌గారు మరో ప్రముఖ వ్యక్తితో జోక్స్ కట్ చేస్తున్నారు. పగలబడి నవ్వుకుంటున్నారు ఇద్దరూ.

నేను వెళ్లి వెనక నిలబడ్డాను ఆ జోక్స్ విందామని.

"ఏమిటోయ్ పేద్ద- రెండు నెలల క్రితమే కదా బొంబేలో నీ బర్త్‌డే చేసుకున్నావ్? అప్పుడే బర్త్‌డే ఎలా వచ్చిందోయ్. రియల్లీ ఇటీజ్ ఫన్నీ"

"బర్త్‌డే దేముందోయ్ మనిష్టం. ఇక్కడ బ్రాంచికి కొత్తగా వచ్చాను. ఎన్నాళ్లుంటానో తెలియదు. పార్టీ పెట్టాలనిపించింది. అకేషన్ దొరకలేదు. అందుకని ఇది. దీనివల్ల రెండు లాభాలు- ఒకటి మన ప్రిస్టేజ్ పెరుగుతుంది. రెండోది మన ప్రాపకం కోసం ప్రాకులాడే వాళ్ళు విధిగా మంచి బహుమతులు తెస్తారు. అదిగో అటు చూడు" అని చూపిస్తున్నారు మా బ్రాంచి మేనేజరుగారు.

ఆయన చూపించిన వేపు మినీ ఫ్రిజ్, ప్రెజర్ కుక్కర్, వాటర్ ఫిల్టర్, మిక్సీలు, ట్రాన్సిస్టర్లు, టు-ఇన్-వన్‌లు వగైరాలు.

బ్రాంచి మేనేజర్‌గారితో మాట్లాడుతున్న వ్యక్తి "హేట్స్ ఆఫ్ టు యువర్ వైజ్ —" మిగతా మాటలు నేను వినలేదు. చాలీ చాలని జీతాలతో మేము కష్టపడి కొన్న ప్రజంటేషన్స్ నన్ను చూసి వెక్కిరిస్తున్నట్టుగా భ్రమపడ్డాను.

—కె.బి.కృష్ణ